క్లుప్తంగా

వరద బాధితులకు అండగా ఉందాం



విరాళాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): విజయవాడ వరద బాధితులకు అండగా నిలుద్దామని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు అన్నారు. సోమవారం నంద్యాల పట్టణంతో పాటు ఆత్మకూరు, రుద్రవరం, తదితర మండలాల్లో వరద బాధితుల సహాయార్థం ఆ పార్టీ ఆధ్వర్యంలో బియ్యం ప్యాకెట్లు, దుప్పట్లను సేకరించారు. వాటిని సీపీఐ రాష్ట్ర కమిటీ ద్వారా వరద బాధితులకు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బాబాఫకృద్దీన్, ప్రసాద్, శ్రీనివాసులు, సోమన్న, తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరం: మండల పరిధిలోని పెద్దకంబలూరు నుంచి విజయవాడ వరద బాధితుల కోసం సీపీఐ రుద్రవరం నాయకులు బియ్యాన్ని విరాళంగా సేకరించారు. సంఘం మండల కార్యదర్శి బాలనరసింహుడు, రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు తదితరులు కలిసి 16 బస్తాల బియ్యాన్ని సేకరించారు.

ప్రథమ చికిత్సపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని వైఎస్సార్ నగర్‌లో ఉన్న కస్తూరిబా పాఠశాలలో ప్రిన్సిపాల్ రమాదేవిరెడ్డి అధ్యక్షతన ప్రథమ చికిత్సపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆనంద్‌కుమార్, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సోమశివారెడ్డి, సెట్కూరు యువజన సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాససింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాణాలు రక్షించడంలో ప్రథమ చికిత్స కీలకమన్నారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనమివ్వాలి

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పని చేస్తున్న శానిటేషన్ కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలవెంకట్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రభుత్వాసుపత్రిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 2 నెలల వేతనాలు వెంటనే ఇవ్వాలన్నారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు చెన్నయ్య, నాయకులు గురుశేఖర్, మహేష్, పుల్లయ్య, సుబ్బమ్మ, సునీత, సరస్వతి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక మహిళ మృతి



మృతి చెందిన విజయలక్ష్మి

రుద్రవరం: మండల పరిధిలోని నర్సాపురం గ్రామానికి చెందిన విజయలక్ష్మి (39)అనే మహిళ ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. ఏఎస్‌ఐ శోభన్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. శ్రీనివాసులు భార్య లక్ష్మీదేవికి గత కొంత కాలంగా కడుపు నొప్పి ఉంది. దీంతో ఆమె పలు మార్లు వైద్యశాలకు వెళ్లి వైద్యం చేయించుకుంది. అయినా, కడుపు నొప్పి తగ్గక పోవడంతో మనస్తాపానికి గురై ఆదివారం రాత్రి ఇంట్లో ఉన్న కల్లాపు పొడిని నీటిలో కలుపుకొని తాగి అపస్మారకస్థితిలో పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందింది. ఈ మేరకు మృతురాలి తల్లి దేవేంద్రమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

వీఓఏలపై వేధింపులు ఆపాలి



ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): వీఓఏలను అక్రమంగా తొలగించడం, వేధించడం వంటి చర్యలను ఆపాలని ఏపీ వెలుగు, వీఓఏ యానిమేటర్ల ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. వారు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్ రాజకుమారికి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షుడు సోమన్న, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, కార్యదర్శి బాలవెంకట్ మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేని విధంగా వీఓఏలపై వేధింపులు పెరిగాయన్నారు. వందలాది మందిని తొలగించారని అన్నారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం జిల్లా నాయకులు వెంకటరమణ, శంకరయ్య, పుల్లయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వరద సహాయక చర్యల్లో ప్రభుత్వం విఫలం

- చంద్రబాబుకు పబ్లిసిటీ పిచ్చి
- బాధితులకు సాయం అందించడంలో నిర్లక్ష్యం
- మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: వరద సహాయక చర్యల్లో చంద్రబాబు సర్కారు ఘోరంగా విఫలమైందని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి విమర్శించారు. విజయవాడ వరద నీటిలో మునిగిపోవడానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ఆరోపించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరద ముంచెత్తి సుమారు వారం రోజులు అవుతున్నా బాధితులను ఆదుకునే దిశగా ఎలాంటి చర్యలు లేవన్నారు. కనీసం భరోసా కూడా కల్పించడం లేదన్నారు. ఇప్పటికి చాలా మంది బిక్కుబిక్కు మంటు వరద నీటిలోనే కాలం వెళ్లదీస్తున్నారన్నారు. సహాయక చర్యలు చేపట్టడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని అన్నారు. బాధితులకు కనీసం ఆహారం, మంచి నీరు కూడా అందించకపోతే ఎలా అని ప్రశ్నించారు. చంద్రబాబు ఇంటికి మూడు కి.మీ దూరంలోనే ఈ విపత్తు వచ్చిందన్నారు. రాష్ట్రానికి భారీ తుపాను ఉందని వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరిక జారీచేసినా ప్రభుత్వం ఏమాత్రం పట్టించులేదన్నారు. దీంతో విజయవాడ ప్రజలు వరద నీటిలో చిక్కుకొని అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వరదల సందర్భంగా జరిగిన ప్రాణ, ఆస్తి నష్టానికి చంద్రబాబే కారణమని ఆరోపించారు. బుడమేరు ఆధునీకీకరణ పనులు చేపడితే టీడీపీ నేతలకు చెందిన భూములు పోతాయనే భూసేకరణ చేపట్టలేదన్నారు. చంద్రబాబు నివాసంతో పాటు ఏబీఎస్ రాధాకృష్ణకు చెందిన పవర్ ప్రాజెక్ట్‌కు నష్టం జరుగుతుందనే ఎటువంటి ముందస్తు హెచ్చరికలు ఇవ్వకుండా అర్ధరాత్రి జనం మీదకు నీటిని వదలాడం దారుణమన్నారు. ఈ విషయాన్ని కప్పిపుచ్చి మాయమాటలు చెబుతున్నారన్నారు. పబ్లిసిటీ పిచ్చితో బాబు రోజూ కెమెరాలు, అధికారులను వెంటేసుకుని తిరగటం వల్లే సహాయక చర్యలు పూర్తి స్థాయిలో జరగటం లేదన్నారు. వరద రాకముందే చంద్రబాబు సురక్షిత ప్రాంతానికి పోయి తలదాచుకున్నారు కదా? మరి జనాన్ని సురక్షిత ప్రాంతాలకు ఎందుకు తరలించలేక పోయారో సమాధానం చెప్పాలన్నారు. అపార పాలన అనుభవం ఉందని చెప్పుకునే బాబు.. వరదల నుంచి ప్రజలను కాపాడటంలో ఎందుకు విఫలమయ్యారని ప్రశ్నించారు. రాష్ట్ర రాజధానిగా చెప్పుకునే విజయవాడలోనే ఈ పరిస్థితి ఉంటే ఎలా అన్నారు.





దీబగుంట్లలో వినాయక విగ్రహాలను తరలిస్తున్న దృశ్యం, ఉయ్యాలవాడలో ఊరేగింపుగా వెళ్తున్న భారీ గణనాథులు, కుందూలో విగ్రహాన్ని వదులుతున్న భక్తులు



రుద్రవరంలో వినాయక విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

బై బై గణేశా!

- ఘనంగా వినాయక నిమజ్జనం
- కనుల పండువగా ఊరేగింపు
- నృత్యాలతో అలరించిన యువకులు
- అన్నదానాలు చేసిన నిర్వాహకులు

ఉయ్యాలవాడ: వాడవాడల కొలువుదీరిన గణనాథులకుభక్తులు వీడ్కోలు పలికారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని శనివారం ఆళ్లగడ్డ నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో విగ్రహాలు ఏర్పాటు చేశారు. మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించి సోమవారం నిమజ్జనం నిర్వహించారు. ఈసందర్భంగా చివరి రోజు వినాయక విగ్రహాల ఊరేగింపు ఘనంగా చేపట్టారు. యువకుల నృత్యాలు, డ్రమ్స్ పలువురిని అలరించాయి. నిమజ్జనోత్సవం సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

● మండలకేంద్రం ఉయ్యాలవాడలో గణేష్ శోభాయాత్ర ఉల్లాసంగా కొనసాగింది. విగ్రహాలను నిమజ్జనానికి తరలించే సమయంలో యువతి, యువకులు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ గణేష్ మహారాజుకి జై అంటూ గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం కుందూనదిలో గణనాథులకు ప్రత్యేక పూజలు చేసి గంగమ్మ ఒడిలోకి చేర్చారు. కుందూనది ఉధృతంగా ప్రవహిస్తూ ఉండడంతో నది వద్ద ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్‌డబ్ల్యు మహేంద్రారెడ్డి, వివిధ శాఖల అధికారులు భక్తులను అప్రమత్తం చేస్తూ నిమజ్జనాన్ని సజావుగా జరిపించారు.

● రుద్రవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం వినాయక నిమజ్జనం సంబరంగా జరిగింది. మండల కేంద్రమైన రుద్రవరంతో పాటు మిగిలిన 41 గ్రామాల్లో దాదాపు 110 వినాయక విగ్రహలను కొలువు దీర్చారు. చివరి రోజు మండపాల్లో కొలువైన వినాయక విగ్రహాలను ట్రాక్టర్లు, ఆటోల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి స్థానిక కుంటలు, చెరువులు, తెలుగుగంగ కాల్వల్లో నిమజ్జనం గావించారు.

● దొర్నిపాడు: మండలంలో వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగింది. ప్రతిష్ఠించిన వినాయకులను భక్తులు కుందూ,కేసీ కెనాల్, కుందర వాగుల్లో నిమజ్జనం చేశారు. పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

గోస్పాడు: మండలంలో మూడురోజుల పాటు పూజలందుకున్న గణనాథులు సోమవారం గంగమ్మ ఒడికి చేరారు. మొదట వినాయక కమిటీల ఆధ్వర్యంలో వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి లడ్డూలకు వేలంపాటలు నిర్వహించారు. అనంతరం విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. ఈ వేడుకలు గ్రామాల్లో ప్రశాంతంగా జరిగేలా సీఐ శ్రీనివాసులు రెడ్డి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వినాయక లడ్డూకు పోటీ

చాగలమర్రి: మండలంలో వినాయక నిమజ్జనోత్సవ కార్యక్రమం కనుల పండువగా జరిగింది. వివిధ గ్రామాల్లో నెలకొల్పిన సుమారు 85 వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి కేసీ కెనాల్‌లో నిమజ్జనం చేశారు. చాగలమర్రి న్యూ బిల్డింగ్స్ కాలనీలో వినాయకుడి మండపం వద్ద లడ్డూ వేలం వేయగా రూ.1.03 లక్షలకు ఉపాధ్యాయురాలు లలిత దక్కించుకున్నారు. అలాగే వినాయక నగర్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద లడ్డూను రూ.16 వేలకు నరేష్, చిన్నవంగలి గ్రామంలో రామాలయం మండపం లడ్డూను రూ.54 వేలకు కాంసాని తులశేశ్వరరెడ్డి, పెద్ద బావి వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలోని లడ్డూను రూ.1.25 లక్షలకు శీలం పెద్ద వెంకటరెడ్డి, అదే గ్రామంలోని మరో మండపం వద్ద వినాయక లడ్డూను రూ.60 వేలకు శీలం రామకేశవ రెడ్డి, సాయి కోడు వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ లడ్డూను రూ.53 వేలకు నరేంద్రారెడ్డి, మద్దూరులో ఏర్పాటు చేసిన వినాయక స్వామి లడ్డూను అంజనేయులు అనే వ్యక్తి రూ.38 వేలకు పాట పడి దక్కించుకున్నారు. చిన్నవంగలి గ్రామంలోని మండపాల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

● శిరివెళ్ల: మండలంలో గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది. మూడు రోజుల పాటు భక్తుల పూజలందుకున్న స్వామి వారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. యువకులు, మహిళలు ఒకరిపై ఒకరు గంధం చల్లుకుంటూ జై గణేశా.. జైజై గణేశా అంటూ నినాదాలు చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. కేసీ కెనాల్, తెలుగు గంగ, కాల్వలు, చెరువులు, వాగుల్లో గణనాథుడిని నిమజ్జనం చేశారు.

● నంద్యాల(అర్బన్): వివిధ వేషధారణలతో గణేష్ నిమజ్జనోత్సవాలను ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నిమజ్జనోత్సవంలో భాగంగా విగ్రహాలను అలంకరించి వీధుల్లో గ్రామోత్సవాలు చేశారు. చాబోలు, కానాల, అయ్యలూరు, పెద్దకొట్టాల, కొత్తపల్లె, భీమవరం, పులిమద్ది, మునగాల, పోలూరు, చాపిరేవుల, మిట్నాల, పుసులూరు తదితర గ్రామాల్లో నిమజ్జనోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.



గోస్పాడు మండలం పసురపాడులో ఊరేగింపు



ఉయ్యాలవాడలో గంగమ్మ ఒడికి చేరిన గణపతి



చాగలమర్రి న్యూబిల్డింగ్స్ కాలనీలో వేలంలో దక్కించుకున్న లడ్డూ ప్రసాదాన్ని స్వీకరిస్తున్న దృశ్యం



శిరివెళ్లలో నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయకులు



చాగలమర్రిలో భారీ గణపతిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు



చాగలమర్రి మండలం చిన్నవంగలి గ్రామంలో అన్నదాన కార్యక్రమం



మహిళలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ వీరభద్రుడు, ముల్లా షబ్బీర్ అహ్మద్

పూజలందుకుంటున్న గణనాథులు



బైర్మల్‌వీధిలో అష్ట వినాయకుడి అలంకరణ

నంద్యాల(వ్యవసాయం): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నంద్యాల పట్టణంలో కొలువైన గణనాథులకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మూడో రోజైన సోమవారం వినాయక మండపాల వద్ద చిన్న పిల్లలచే భగవద్గీత శ్లోకాలు, లలితా, విష్ణుశ్వర సహస్రనామ పారాయణం, మ్యాజిక్‌షో తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక చిత్తులూరి వీధిలో వివిధ రకాల ఆధ్యాత్మిక పుస్తకాలతో విద్యాగణపతిగా అలంకరించి పూజలు చేశారు. బాలాజీ కాంప్లెక్స్‌లో శ్రీ కొట్టె బాలాజీ కల్యాణ మండపం నందు లోకకల్యాణం కోసం సుబ్రమణ్య స్వామి హోమం, లక్ష్మీగణపతి, నవగ్రహ శాంతి హోమాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బైర్మల్ వీధిలో ఏర్పాటు చేసిన అష్టవినాయకుడి వద్ద నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. బొంతల వీధిలో వినాయకుడిని రాధాశ్రీకృష్ణుడి వేషధారణలో అలంకరించి పూజలు చేశారు. బొమ్మలసత్రం ఫ్లై ఓవర్ కింద వైఎస్సార్సీపీ సీనియర్ నాయకుడు మలికిరెడ్డి రాజగోపాల్ రెడ్డి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాల గణేష్ విగ్రహం భక్తులను విశేషంగా ఆకర్షిస్తుంది.



వినాయక మండపం వద్ద మ్యూజికల్ చైర్స్ ఆడుతున్న చిన్నారులు

మినుము రైతు కుదేలు!



ఇక్కడ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు యూనుఫ్. ఈయన డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో ఐదు ఎకరాలకు పైగా మినుము పంట సాగుచేశాడు. ప్రస్తుతం మినుము పంటను కోత కోయగా కేవలం ఎకరానికి రెండు క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయి. కనీసం పెట్టుబడులు కూడా రాలేదు. తమను వర్షం చాలా దెబ్బతీసిందని ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నాడు.



చాకరాజువేముల సమీపంలో నీటిలోనే మినుము పంట

- భారీగా దెబ్బతీసిన వర్షం
- ఎకరాకు 6 క్వింటాళ్లు రావాల్సి ఉండగా రెండు క్వింటాళ్లే వస్తున్న వైనం
- ఆందోళనలో అన్నదాత

దొర్నిపాడు: మినుము రైతులు ఈసారి నష్టాలు మూటగట్టుకుంటున్నారు. ఏటా ఖరీఫ్‌లో రైతులకు కలిసి వచ్చే ఈపంటకు వర్షం భారీ దెబ్బతీసింది. పంట సాగు సమయంలో వాతావరణం అనుకూలంగా ఉండటం.. ఆతర్వాత పైర్లు కాయలతో కళకళలాడుతుండటంతో ఎకరానికి 6 క్వింటాళ్లకు పైగా దిగుబడులు వస్తాయని ఆశించారు. పంట కోత సమయంలో పదిరోజులుగా విరామం లేకుండా వర్షం కురవడంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయి. ఎకరాకు రెండు క్వింటాళ్ల దిగుబడి కూడా రాని పరిస్థితి ఏర్పడింది.

741 హెక్టార్లలో సాగు

కేసీ కాల్వ, మెట్ట ప్రాంతాల్లో తొలకరి వర్షాలకు ప్రతి ఏటా వరిసాగుకు ముందు మినుము పంట చేస్తారు. ఈసారి గతేడాది కంటే అధికంగా దొర్నిపాడు మండలంలోనే 741 హెక్టార్లలో మినుము సాగుచేశారు. ఒకవేళ కేసీకి ముందుగానే సాగునీరు విడుదల చేస్తే వెంటనే పంటంతా పచ్చిరొట్ట ఎరువుగా మార్చుకోవచ్చని రైతులు రెండు విధాలుగా ఆలోచనతో సాగు చేశారు. అయితే, ఈసారి వర్షాలు అనుకూలంగా కురవడంతో పంట కూడా చేతికి వస్తుందని ఆశించారు. అంతేగాక కేసీకి కూడా సాగునీరు పూర్తిస్థాయిలో రావడంతో రైతులు వెంటనే మినుము కోతకోసి వరిని సాగు చేసేందుకు సిద్ధమయ్యారు.

కష్టమంతా వర్షార్పణం

రైతులు మినుమ పంటకు ఎకరానికి రూ.10 నుంచి రూ.15వేల వరకు పెట్టుబడులు పెట్టారు. ప్రస్తుతం మార్కెట్లో మినుములు క్వింటాకు రూ.8 వేల వరకు ధర పలుకుతోంది. ఎకరానికి 6 క్వింటాళ్ల దిగుబడులు వచ్చినా ఆశించినంత లాభాలు వస్తాయనుకున్నారు. కానీ వర్షం విడువ కుండా కురవడంతో కాయలన్నీ చినులకు పగిలి నేలరాలి మొలకలు వచ్చాయి. దీంతో రెండు క్వింటాళ్లకు మించి దిగుబడులు రావడంలేదని రైతులు వాపోతున్నారు. తమ కష్టమంతా ఇటీవల కురిసిన వర్షం పాలైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

9 ఎకరాలు...9 క్వింటాళ్లు



నేను ఈసారి మినుము ధర బాగుందని మూడెకరలా సొంత పొలంతో పాటు ఎకరానికి రూ.20వేలు కౌలు చెల్లించి మరో ఆరు ఎకరాలు తీసుకొని మొత్తం 9ఎకరాల్లో మినుము సాగు చేశాను. ప్రస్తుతం అంతా కలిపి 9 క్వింటాళ్లు కూడా దిగుబడులు రాలేదు. రూ.1.20 లక్షలు కౌలే చెల్లించాను. మిగతా పెట్టుబడులు రూ.లక్షకు పైగానే వచ్చాయి. దిగుబడులు చూస్తే దారుణంగా ఉన్నాయి. విక్రయిస్తే పెట్టుబడులు కూడా రాని పరిస్థితి. మమ్మల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.

– టి.ఉసేన్‌బాషా, డబ్ల్యూ గోవిందిన్నె

ప్రాథమిక అంచనా నివేదించాం



మండలంలో సుమారు 360 హెక్టార్లలో మినుము పంటకు నష్టం వాటిల్లినట్లు ఉన్నతాధికారులకు ప్రాథమిక అంచనా వేసి నివేదించాం. చాలా వరకు పంటకోత పూర్తయ్యింది. ఆలస్యంగా సాగుచేసిన పంటకు వర్షం దెబ్బ తగిలింది. రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులను కలిసి వివరాలు అందజేయాలి.

–సునీత, ఏఓ, దొర్నిపాడు

ఉపాధ్యాయుల కొరత తీర్చాలి

నంద్యాల(న్యూటౌన్): పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యాబోధన కుంటుపడుతోందని నంద్యాల జిల్లా ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన అధ్యక్ష కార్యదర్శులు రామచంద్రారెడ్డి, రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ భాస్కరరెడ్డి, ప్రధాన కార్యదర్శి కేవీ శివయ్య అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలో ఇప్పటికే చాలా మంది ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందారన్నారు. ఆ స్థానాలు భర్తీ చేయకపోవడంతో విద్యార్థులకు సబ్జెక్టు ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే విద్యావలంటీర్లను నియమించాలని డిమాండ్ చేశారు. పాఠశాల మెయింటెన్స్ నిధులను విడుదల చేయాలని, సరెండర్ లీవ్, పీఆర్సీ, డీఏ, పీఎఫ్ రుణాలు వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 80మంది విద్యార్థులు ఉన్న చోట హెచ్‌ఎం పోస్టు మంజూరు చేయాలన్నారు. 117వ జీవోను రద్దు చేసి 3, 4 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లో యథావిధిగా కొనసాగించాలన్నారు. విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా పీడీ పోస్టులను మంజూరు చేయాలన్నారు.

సురక్షిత మంచినీరు అందించాలి

శిరివెళ్ల: ప్రజలకు సురక్షిత మంచినీరు అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిరణ్‌బాబు అన్నారు. సోమవారం శిరివెళ్ల, కామినేనిపల్లె, వీరారెడ్డిపల్లె, కోటపాడు గ్రామాల్లో రక్షిత మంచి నీటి పథకాలను పరిశీలించారు. వాటర్ మ్యాన్ పనితీరు, క్లోరినేషన్, పైప్‌లైన్ల లీకేజీలపై ఆరా తీశారు. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు పడ్డాయని, నీరు కలుషితం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులను కోరారు. 15 రోజులకోసారి క్లోరినేషన్ చేయించాలని , పైప్‌లైన్లలో లీకేజీలు ఏర్పడిన వెంటనే వాటికి మరమ్మతులు చేయాలన్నారు. బ్లీచింగ్ పౌడర్ నిల్వ పెట్టుకోవాలన్నారు. ఆర్థిక సంఘం నిధులతో ఈ పనులు చేయాలన్నారు.

మల్లారెడ్డి కుంట పరిశీలన

సాక్షి ఎఫెక్ట్

చాగలమర్రి: మండలంలోని చిన్నవంగలి గ్రామంలో మల్లారెడ్డి కుంటకు పడిన గండిని పూడ్చివేసేందుకు చర్యలు చేపడుతామని మైనర్ ఇరిగేషన్ అధికారులు తెలిపారు. మల్లారెడ్డి కుంటకు గండి.. 100 ఎకరాల్లో పంట నష్టం అన్న శీర్షికన సాక్షి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. మైనర్ ఇరిగేషన్ డీఈ వెంకటరమణ.. ఏఈ మునాఫ్‌తో కలిసి గండి పడిన మల్లారెడ్డి కుంటను సోమవారం పరిశీలించారు. నీరు వృథాగా పోకుండా ప్రస్తుతం తాత్కాలికంగా మరమ్మత పనులు చేపట్టేందుకు అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు తెలిపారు. అక్కడి నుంచి ఆదేశాలు రాగానే పనులు చేపడతామని వారు తెలిపారు.



చిన్నవంగలి గ్రామంలో గండి పడిన మల్లారెడ్డి కుంటను పరిశీలిస్తున్న అధికారులు